## క్లుప్తంగా

### ఉమాకామేశ్వర జాతరకు సర్వం సిద్ధం



ఉమాకామేశ్వర స్వామి ఆలయం

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో గురువారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్న ఉమాకామేశ్వర జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు వాసుదేవ శర్మ బుధవారం తెలిపారు. జాతరకు ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై పురవీధులగుండా ఊరేగింపు చేస్తామని తెలిపారు. ఈ జాతరకు ఆమదాలవలస, నరసన్నపేట, జలుమూరు, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారని తెలిపారు. భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

### దుప్పట్లు, దుస్తుల పంపిణీ



దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న సేవా సంఘం సభ్యులు

పొందూరు: స్థానిక కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మి చేతుల మీదుగా సంఘ అధ్యక్షుడు కాకినాడ రాజారావు అందజేశారు. సంఘం కార్యదర్శి అరసవెల్లి వెంకట్రావు నలుగురు నిరుపేదలకు రూ.4 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా సోమాలమ్మ ఉత్సవాలు



బహుమతులు అందజేస్తున్న అతిథులు

సరుబుజ్జిలి: చిన్నపాలెం గ్రామానికి సమీపంలోని దంతపురి క్షేత్రంలో సోమాలమ్మ దుర్గాంబ ఆలయ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో జాతరతోపాటు, వివిధ రకాల వేషధారణలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మావుదూరి కృష్ణారావు శర్మ అమ్మవారికి కుంకుమపూజలు, అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మెండ సూర్యారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సారవకోట: మండల కేంద్రంలోని ఉజ్జయిని మహాకాళి ఆలయ 24వ వార్షికోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక, విశేష పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలను పురోహితులు శ్రీనివాసరావు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో అరటి గెలలు వేలాడదీసి మొక్కులు తీర్చుకున్నారు.

### నగర సంకీర్తన



పురుషోత్తపురంలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: ధనుర్మాసం ముగింపు సందర్భంగా మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో మంగళవారం భక్తుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా భక్తులు పురవీధుల్లో గోదా రంగనాథస్వామికి సంబంధించిన భక్తి గేయాలు, విష్ణుకోటి పారాయణాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆండాల్ భక్తులు, గోష్టులు పాల్గొన్నారు.

### 19న ప్లాటినమ్ జూబ్లీ

కొత్తూరు: ఈ నెల 19వ తేదీన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామని, దీనిని విజయవంతం చేయాలని హెచ్ఎం ఎ.గోవిందరావు కోరారు. పాఠశాల వద్ద బుధవారం పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ పాఠశాల 1950లో స్థాపించారని, ఈ ఏడాదికి 75 ఏళ్లు పూర్తవుతున్నందున ప్లాటినమ్ జూబ్లీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులందరూ సహకరించాలని కోరారు. ఎస్ఎంసీ చైర్పర్సన్ కె.కళావతి, వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు, మాజీ సర్పంచ్ తాతబాబు, టొంపల తిరుపతిరావు పాల్గొన్నారు.

# సంప్రదాయాల సంక్రాంతి

సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరిపారు. సంక్రాంతి రోజున పెద్దలకు పాత్రలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కనుమ రోజు పశువులను అలంకరించి.. పూజలు చేసి సంప్రదాయాన్ని కొనసాగించారు. బసవన్నల సందడి, ఆడపడుచులు వేసిన రంగవల్లికలతో పల్లెలు కళకళలాడాయి. చాలామంది దాతలు పేదలకు వస్త్రదానం చేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. మరి కొన్ని చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: కళింగ వైశ్య సంఘం సంబరాల్లో సందడి చేస్తున్న మహిళా సభ్యులు



పాతపట్నం: షిర్డీ సాయిబాబా మందిరంలో సహస్ర దీపారాధన చేస్తున్న భక్తులు



ఎల్.ఎన్.పేట: కొమ్మువలసలో నిర్వహిస్తున్న అధ్యాత్మిక కార్యక్రమం



సారవకోట: మండల కేంద్రంలో నెయ్యిగుర్రం ప్రదర్శన ఇస్తున్న గిరిజనులు



హిరమండలం: చేపలు కొనుగోలు చేస్తున్న జనం



హిరమండలం: మాంసం కొనుగోలు చేస్తున్న ప్రజలు



కొత్తూరు: ఓండ్రుజోలలో డాన్స్ వేస్తున్న చిన్నారులు



ఆమదాలవలస: శ్రీనివాసాచార్యులపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ఆమదాలవలస: అక్కులపేటలో గోపూజ నిర్వహిస్తున్న గ్రామస్తులు



నరసన్నపేట: వీరన్నాయుడు కాలనీలో గోపూజ నిర్వహిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, తదితరులు



బూర్జ: డొంకలపర్తలో పశువులకు పిండి వంటలు తినిపిస్తున్న మహిళ, చిన్నారులు



కొత్తూరు: ఓండ్రుజోలలో ముగ్గుల పోటీలు



కొత్తూరు: అల్లు వీధిలో సంక్రాంతి సంబరాలు



పాతపట్నం: గంగుపేటలో ముగ్గుల పోటీ



పాతపట్నం: చంద్రయ్యపేటలో సాంఘిక నాటకల ప్రదర్శన

## నేడు శ్రీరాంపాడు యాత్ర

- ఏర్పాట్లు పూర్తి
- కంబకాయలో స్వయంబేశ్వర స్వామి ఆలయ 75 వార్షికోత్సవం



శివాలయం

నరసన్నపేట: మండల పరిధిలోని రెడ్డికిపేట–అంప్లాం మధ్య, బసివలస రోడ్డుకు ఆనుకొని ఉన్న శివాలయం వద్ద హాలహలేశ్వరుని (శ్రీరాంపాడు) యాత్ర గురువారం జరగనుంది. ఈ మేరకు యాత్ర కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏటా ముక్కనుమ రోజున ఈ యాత్ర నిర్వహిస్తారు. నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాల నుంచి వేలాది మంది యాత్రలో పాల్గొంటారు. ప్రధానంగా చిన్నపిల్లలు అధిక సంఖ్యలో యాత్రకు వస్తారు. 16వ శతాబ్దంలో ఉర్లాంకు చెందిన కొంక్యాన జగ్గనాయుడు ఈ శివాలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటినుంచి ఈ శివాలయం వద్ద ముక్కనుమ రోజున యాత్ర నిర్వహిస్తున్నారు. వచ్చిన వారందరికీ ఉచితంగా ప్రసాదం కల్పించనున్నట్లు గొట్టిపల్లి, దూకులపాడు సర్పంచ్‌లు అవ్వ రవీంద్రనాథ్ రెడ్డి, అల్లు అసిరినాయుడు, కమిటీ సభ్యులు శిమ్మ లక్ష్మణరావు తెలిపారు. తాగునీటి సదుపాయం కల్పించినట్లు తెలిపారు. యాత్ర ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యుడు శిమ్మ లక్ష్మణరావు కోరారు. కంబకాయ కూడలిలో స్వయంబేశ్వరి స్వామి ఆలయం 75 వార్షికోత్సవం సందర్భంగా ముక్కనుమ రోజున యాత్ర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పాగోటి కుసుమ కుమారి తెలిపారు.

## ఘనంగా పార్వేట ఉత్సవం



నరసన్నపేట: పారశిల్లిలో యాత్రకు హాజరైన జనం

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామికి ఏటా నిర్వహించే పార్వేట ఉత్సవం బుధవారం సాయంత్రం సంతపేట ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహించి సంతపేటలోని మండపంపై భక్తుల దర్శనం కోసం ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కనుమ రోజున ఏటా పార్వేట ఉత్సవం నిర్వహిస్తామని అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు తెలిపారు. ఇదే ప్రాంగణంలో యాత్ర జరిగింది.



నరసన్నపేట: సంతపేట మండపంపై ఉన్న విగ్రహాలకు పూజిస్తున్న భక్తులు

**పారశిల్లిలో..**

పారశిల్లిలో కాశీవిశ్వేశ్వరస్వామి యాత్ర ఘనంగా నిర్వహించారు. సుందరాపురం నుంచి కాశీవిశ్వేశ్వర స్వామిని తీరువీధి నిర్వహించి పారశిల్లికి తీసుకువచ్చి అక్కడ యాత్ర జరపడం ఆనవాయితీ. బుధవారం కాశీవిశ్వేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. చెన్నాపురం, సుందరాపురం, తెలగవలస, రెల్లివలస, అల్లాడ తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి యాత్రలో పాల్గొన్నారు.

**వైభవంగా లచ్చమ్మ పేరంటాల జాతర**

బూర్జ: మండల కేంద్రంలో చాలిలి లచ్చమ్మ పేరంటాల జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకురాలు గుడ్ల నవనీతం ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. పండగ మూడు రోజులు గ్రామంలో సందడి నెలకొంది.



బూర్జ: బోనాలతో గ్రామస్తులు

### నీలమణిదుర్గమ్మకి ప్రత్యేక పూజలు



క్యూలో వేచి ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న నీలమణిదుర్గ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పాతపట్నం మేజర్ పంచాయతీ, కొరసవాడ, కాగువాడ, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఘటాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ టి.వాసుదేవరావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

### వ్యక్తిపై దాడి



గాయపడిన రాంప్రసాద్

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్అర్ కాలనీకి చెందిన సొంట్యాన రాంప్రసాద్‌పై బుధవారం మెట్టూరు బిట్–3 ఆర్అర్ కాలనీకి చెందిన బిల్ల సెంటి, సప్తగిరి, మీసాల షణ్ముఖరావు పాటు మరో ముగ్గురు దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ తెలిపారు. ఉదయం ఓ విషయమై వాగ్వాదం జరిగిందని, సాయంత్ర వచ్చి రాంప్రసాద్‌పై దాడికి పాల్పడ్డారన్నారు. రాంప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

### నాణ్యత తప్పనిసరి



రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

కొత్తూరు: రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీరామ్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని మహసింగిలోని వరహా నర్సింహస్వామి ఆలయానికి రూ.35 లక్షల దేవదాయ ధర్మాదాయశాఖ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, మాజీ సర్పంచ్ తాతబాబు, పి.వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## భక్తితోనే ముక్తికి మార్గం



ధర్మాన కృష్ణదాస్‌తో కమిటీ పెద్దలు, గ్రామస్తులు

జలుమూరు: భక్తితోనే ముక్తి, మానసిక ప్రశాంత కలుగుతాయని, ప్రతీ ఒక్కరిలో భక్తిభావం ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం కనుమ పురస్కరించుకుని కరవంజలో కాశీవిశ్వేశ్వర ఆలయ ఐదో వార్షికోత్సవం నిర్వహించారు. సందర్భంగా స్వామివారికి కృష్ణదాస్ ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టిన నిర్వాహకులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, సర్పంచ్ జుత్తు నేతాజీ, కమిటీ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు: మండలంలోని గోరింట గ్రామంలో అవినాష్ సావే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై సంక్రాంతి సంబరాలు మంగళవారం నిర్వహించారు. ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత అని ఫౌండేషన్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి, సీఐటీయూ నాయకుడు కూన వెంకటరావు అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ముగ్గులు, క్రికెట్, వాలీబాల్, తదితర పోటీల్లో గెలిపొందిన వారికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ బహుమతులు అందజేశారు. గ్రేహౌండ్స్ డీఎస్పీ బాడాన సోమయ్య, సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చింతాడ అమ్మన్నాయుడు, ట్రస్టు సెక్రటరీ దుంపల మృదుల, శ్రీధర్, చింతాడ వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ విజేతగా బుడితి, బద్రి



విజేతలకు బహుమతి అందజేస్తున్న గ్రామస్తులు

సారవకోట: మండలంలోని బద్రి గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో బుడితి, బద్రి టీమ్‌లు విజేతలుగా నిల్చాయి. బుధవారం ఫైనల్ పోటీలు నిర్వహించారు. వెలుతురు సరిగా లేక పోవడంతో ఇరుజట్లను విజేతలుగా ప్రకటించారు. సంక్రాంతి పురస్కరించుకుని స్థానిక యువకులు నిర్వహించిన ఈ వాలీబాల్ పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 26 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతలకు రూ.26 వేలు నగదు బహుమతిని గ్రామ పెద్దలు మజ్జి అప్పన్న, మెండ సూర్యనారాయణ, శ్రీపతి, వేణు, కృష్ణ, తదితరులు అందజేశారు.

## కరవంజలో బల ప్రదర్శన పోటీలు



వెయిట్‌లిఫ్టింగ్ ఎత్తుతున్న గోవిందరావు

జలుమూరు: సంక్రాంతి పురస్కరించుకుని కరవంజ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా స్థాయి బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. తీత సంగిడిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గేదెల సత్యనారాయణ, ఆవల గోవిందరావు, పొదిలాపు కృష్ణ, విసురు సంగిడి పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గేదెల సత్యనారాయణ, ఆవల త్రినాథరావు, వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా ఆవల గోవిందరావు, గుజ్జల ట్వింకిల్ కుమార్, కె.రామకృష్ణ నిలిచారు. వెయిట్ లిఫ్టింగ్‌లో మహిళల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సీహెచ్ రాజ్యలక్ష్మి, సీహెచ్ హారిక, బి.సాయిలక్ష్మికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.